
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024

పవిత్రోత్సవాల సందర్భంగా తొలిరోజు ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. మూడు రోజులపాటు ఆలయంలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. వేకువజామున 3 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపన కార్యక్రమాలను నిర్వహించటం కారణంగా సమయం తీసుకోవటంతో సాధారణ దర్శన సమయానికన్నా ఆదివారం 4 గంటలు ఆలస్యంగా దర్శనాలు ప్రారంభమయ్యాయి. క్యూలైన్లలో భక్తులు భారీ సంఖ్యలో వేచి ఉన్నారు.



బ్యారేజీకి మళ్లీ వరద

53,866 క్యూసెక్కుల నీరు రాక

ప్రకాశం బ్యారేజీ గేట్లు మళ్లీ పైకి లేచాయి. పులిచింతలకు అనుబంధంగా ఉన్న జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదల చేస్తున్న నీటిని దిగువకు విడుదల చేశారు. జలవిద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం పులిచింతల నుంచి 53,866 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఈ మొత్తం నీటిని 50 గేట్లను అడుగు మేరకు ఎత్తి దిగువలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ 20 గేట్లను కిందికి దించి ఉంచారు. ఈ ఇన్‌ఫ్లో మరో రెండు రోజులు ఉంటుందని బ్యారేజీ అధికారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఇంద్రకీలాద్రి కిటకిట



అన్నదాత నీటిపాట్లు!

శివారు ప్రాంతాలకు చేరని సాగునీరు

మండే ఎండలతో ఎగువప్రాంతంలో సాగునీటి వినియోగం అధికం

» 15 రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు

» తీరప్రాంతంలో నిలిచిన వరినాట్లు

» పంటలను కాపాడుకునేందుకు రైతన్నల విశ్వప్రయత్నం



ఘంటసాల మండలం ఎండకుదురులో వరిపొలాలకు నీరందకపోవడంతో ఖాళీగానే ఉన్న భూములు

కృష్ణాడెల్టాను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. 15 రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. జిల్లాలోని శివారు ప్రాంతాలతోపాటు ఎగువ ప్రాంతాల్లోనూ పంటపొలాలు నీరు లేక నెర్రెలిస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. పంట కాలువలకు నీరు విడుదల చేస్తున్నా శివారు ప్రాంతాల్లోని పొలాల్లోకి నీరు చేరడంలేదు. ఒకవైపు ఎండలు మండిపోతుండటంతో వరిపైరును ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులకు ఆకాశం వైపునకు చూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో ఈ ఏడాది వరి సాగు అవుతుందని అంచనా. ఇప్పటివరకు 1.15 లక్షల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. నాట్లువేసిన పొలాల్లో నీరులేక పైరులో ఎదుగుదల లోపిస్తోంది. సాగునీరు అందుబాటులో లేక శివారు ప్రాంతాల్లో వరినాట్లు మరింతగా ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

● ప్రాజెక్టులు నిండుగా ఉన్నా..

శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులలో నీరు నిండుగా ఉంది. ఈ ఏడాది సకాలంలోనే ఈ ప్రాజెక్టులు నీటితో నిండాయి. 10 రోజుల క్రితం వరకు ప్రకాశం బ్యారేజీ నుంచి 3 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రధాన కాలువలకు నీటిని వదులుతున్నా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎగువ ప్రాంత రైతులు నీటిని అధికంగా వినియోగించడంతో కాలువ చివరి భూములకు సాగునీరు అందడంలేదు.

● సముద్రతీర మండలాల్లో తీవ్ర ఎద్దడి

కేఈబీ ప్రధాన కాలువ నుంచి మోపిదేవి మండలం కే కొత్తపాలెం వద్ద 9వ నంబరు కాలువకు నీరు విడుదల కావాల్సి ఉంది. ఈ కాలువకు 10 బ్రాంచ్ కాలువలు ఉన్నాయి. చల్లపల్లి మండలంలోని చల్లపల్లి, మాజేరు, బందరు మండలంలోని యాదర, చిన్నాపురం, వాడపాలెం, కేపీటిపాలెం, తుమ్మలచెరువు, కోన, భవానీపురం, వెంకట దుర్గాంబపురం తదితర గ్రామాలకు ఈ బ్రాంచ్ కాలువల ద్వారా నీరు విడుదల చేయాల్సి ఉంది. సాగునీరు పూర్తిగా విడుదల చేయకపోవడంతో ఈ గ్రామాల్లో ఇంకా పూర్తిస్థాయిలో నారుమడులు పోయలేదు. గత రెండు రోజులక్రితం వరకు వంతుల వారీ పద్ధతిలో 9వ నంబరు ప్రధాన కాలువకు ఉన్న బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేశారు. రైతులు నారుమడులు సిద్ధం చేసుకునేలోపే నీటిని ఆపేశారు. మళ్లీ వచ్చే మంగళవారం నాటికి నీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో నారుమడులకు సైతం నీరందడం లేదని, పోసిన నారుమడులు మండుతున్న ఎండలకు ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. కాలువలకు నీటిని విడుదల చేసినా కాలువలు పొంగడానికి ఒకరోజు సమయం పడుతుందని, రెండు రోజులపాటు నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయడంలేదని, దీంతో ఇక్కట్లు పాలవుతున్నామని రైతులు అంటున్నారు. వర్షం కురిస్తే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు ఎదురుచూస్తున్నా వరుణుడు కనికరించపోడంతో రైతులు మరింత దిగులు పడుతున్నారు. దీంతో ఈ ఏడాది శివారు ప్రాంతాల్లో వరినాట్లు వేస్తామా? లేదా? అని బందరు మండలంలోని శివారుప్రాంత గ్రామాల రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఘంటసాల మండలంలో

ఘంటసాల మండలంలోని ఘంటసాల, లంకపల్లి, చిట్టూర్పు, దాలిపర్రు పూషడం, చల్లపల్లి మండలం మాజేరు, తదితర గ్రామాలకు సాగునీరు సక్రమంగా చేరడంలేదు. శ్రీకాకుళం వద్ద ప్రారంభమై ఘంటసాల గ్రామంలోని చివరి భూములకు సాగునీటిని అందించే 2/3వ నంబరు కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడంలేదు. దీంతో ఘంటసాల గ్రామంలోని శివారుప్రాంత భూములకు సాగునీరు అందనిస్థితి నెలకొంది. మొవ్వ మండలం పెదముత్తేవి వద్ద ప్రారంభమయ్యే భీమనది చానల్ ఘంటసాల మండలంలోని చిలకలపూడి మల్లంపల్లి, దేవరకోట, మల్లాయిచిట్టూరు, ఎండకుదురు తదితర గ్రామాల్లోని పంటపొలాలకు సాగునీరు అందిస్తుంది. ఈ కాలువకు సాగునీరు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఎండకుదురు గ్రామానికి ఇంకా సాగునీరు చేరకపోవడంతో పొలాల్లో చుక్కనీరు లేకుండాపోయింది. ఇటీవల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ భీమనది చానల్‌ను పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఎగువ ప్రాంతంలోని తూములను కట్టివేసి, దిగువప్రాంత భూములకు సరిపడా సాగునీరు అందించాలని నీటిపారుదలశాఖ అధికారులకు ఆయన సూచించారు. కోడూరు మండలంలోని రామకృష్ణాపురం, బసవానిపాలెం, ఊటగుండం తదితర గ్రామాలకు సాగునీరు చేరలేదు. దీంతో ఈ గ్రామ రైతులు నారుమడులు పోసేందుకు అవకాశం లేకుండా పోయింది. సాలెంపాలెం, నారేపాలెం, వేణుగోపాలపురం, ద్వారక తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడంలేదు. ద్వారక గ్రామం వద్ద 14వ నంబరు కాలువకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు రైతులు ప్రయత్నించడంతో రైతుల మధ్య సాగునీటి విషయంలో వివాదం చెలరేగింది. నాగాయలంక, కోడూరు మండలంల్లోని గ్రామాలకు వంతులవారీగా సాగునీటిని విడుదల చేస్తున్నట్టు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నా ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కావడంలేదు.

అనుమానమే పెనుభూతమై..

● భార్యను కడతేర్చిన భర్త



నక్కా సునీత (ఫైల్)

పెదపారుపూడి, ఆగస్టు 18 : అనుమానమే పెను భూతమైంది. కట్టుకున్న భార్యను భర్తే కడతేర్చేలా చేసింది. ఈ దారుణం మండలంలోని పాములపాడు శివారు దూళ్లవానిగూడెంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కా సునీత (25) మొదటి భర్తతో గొడవల కారణంగా విడిపోయి అదే గ్రామానికి చెందిన రాజేష్‌తో రెండో వివాహం చేసుకుంది. వారికి కుమార్తె ఉంది. కొంతకాలంగా వీరి వివాహ దాంపత్యం సాఫీగానే సాగుతోంది. ఇంటిలో ఆర్థిక పరిస్థితులు బాగోక అప్పులు చేశారు. అప్పులవారి ఒత్తిడి ఎక్కువైంది. భర్త రాజేష్ ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అప్పుల వారి బాధలు భరించలేక సునీత గుడివాడలోనే ఓ దుకాణంలో పనికి చేరి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకుంటూ ఉంది. తిరిగి వచ్చిన భర్త రాజేష్‌తో గొడవలు మొదలయ్యాయి. ఐదు రోజులుగా ఆమె వేరే వ్యక్తితో బైక్‌పై వెళ్తుండటాన్ని భర్త గమనించాడు. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. శనివారం సునీత షాపులో పని చేయటానికి వెళ్లింది. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో దూళ్లవానిగూడెం వెళ్లే ఆటో ఎక్కింది. అందులో అదే ఊరి వాళ్లు ఉన్నారు. ఇంటికి వెళ్లే క్రమంలో పెదపారుపూడి సెంటర్‌లో ఆటో దిగింది. ఇంటికి రావా అని ఆటో ఉన్న వాళ్లు అడిగితే పని ఉందని, తరువాత వస్తానని చెప్పింది. అప్పటికే పెదపారుపూడిలో ఆమె భర్త రాజేష్ కాపుగాసి ఉన్నాడు. సునీతను చూసి ఇంటికి వెళ్దాం రమ్మని తీసుకుని వెళ్లే క్రమంలో మార్గమధ్యలో కొట్టి పంటబోదులోని నీటిలో ముంచి హత్య చేశాడు. తర్వాత ఎవరు చూడకుండా మృతదేహాన్ని రైలు పట్టాలపై పడేసి సునీత రైలు కింద పడి చనిపోయినట్టుగా కథను అల్లాలని వ్యూహం పన్నాడు. సునీత మృతదేహం పట్టాల మీద నుంచి జారి కింద పడిపోవటంతో ఎటువంటి గాయాలు కాలేదు. మృతదేహాన్ని చూసి పోలీసులు ఆమె భర్త రాజేష్‌ని విచారించారు. తానే భార్యను చంపినట్టు అంగీకరించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పెదపారుపూడి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

హంసలదీవి బీచ్‌లో విషాదం

అలల తాకిడికి కొట్టుకుపోయిన ఆరుగురు

» యువకుడి గల్లంతు, మహిళ మృతి

4లో..

» నలుగురిని రక్షించిన స్థానికులు, మెరైన్ పోలీసులు

ఆస్థాన అసిస్టెంట్లు



సంప్రదాయంగా మారిన అసిస్టెంట్లు

ప్రతి ఇన్‌స్పెక్టర్‌కు ప్రత్యేకంగా ఒక అసిస్టెంట్

ఇన్‌స్పెక్టర్‌గా ఎవరున్నా అసిస్టెంట్లు మాత్రం వాళ్లే

● ఇన్‌స్పెక్టర్ల తర్వాత తామే అన్నట్టుగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కృష్ణాజిల్లా, కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్న కానిస్టేబుళ్ల తీరు వివాదాస్పదమవుతోంది. ఈ అసిస్టెంట్ల స్థానంలో కొంతమంది ఏళ్లతరబడి పాతుకుపోవడంతో ఆరోపణలూ తీవ్రంగానే వస్తున్నాయి. కమిషనరేట్, కృష్ణా జిల్లాలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఈ రెండు కాకుండా ప్రత్యేకంగా సీసీఎస్ విభాగంలోనూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఉంటాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించే ఇన్‌స్పెక్టర్లకు సహాయకుడిగా కానిస్టేబుల్, హోంగార్డును నియమించుకునే అవకాశం ఉంది. ఎక్కువమంది ఇన్‌స్పెక్టర్లు కానిస్టేబుళ్లను అసిస్టెంట్లుగా నియమించుకున్నారు. వారి ప్రవర్తన పోలీసు వర్గాల్లోనే విమర్శలకు తావిస్తోంది.

మార్పు కనిపించేనా..

ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మూడేళ్లపాటు పనిచేస్తారు. కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లను ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే బదిలీ చేస్తారు. స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ ఒక అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆ తర్వాత ఎంతమంది ఇన్‌స్పెక్టర్లు మారినా వాళ్లే అసిస్టెంట్లుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో బదిలీలు జరుగుతున్నందున అసిస్టెంట్ల వ్యవహారంపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం అసిస్టెంట్లుగా పనిచేస్తున్నవారు సుదీర్ఘకాలంగా అదే పోస్టులో కొనసాగుతున్నారు. తాజాగా కమిషనరేట్‌లో 100 మంది ఎస్ఐలను మార్పు చేశారు. ఈ నేపథ్యంలో ఇటు కమిషనరేట్‌లోను, అటు జిల్లాలోను అసిస్టెంట్ల మార్పు ఉంటుందా అన్న ప్రశ్న పోలీసు వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యహరించేవారు యూనిఫాంలో ఉండరు. నిత్యం సివిల్ దుస్తుల్లోనే కనిపిస్తారు. ఇన్‌స్పెక్టర్ ఎక్కడికి వెళ్తే అక్కడికి వెంట వెళ్తారు. స్టేషన్‌లో ఇతర సిబ్బంది మాదిరిగా షిఫ్టులు ఉండవు. ఒకవేళ వీఐపీ బందోబస్తులు నిర్వహించాల్సి వచ్చినా ఇన్‌స్పెక్టర్లకు నీడలా ఉంటారు. ఇవన్నీ పైకి కనిపించే సదుపాయాలు మాత్రమే. పైకి కనిపించని, ఆధారాలు లేని రాచకార్యాలు కొన్నింటిని అసిస్టెంట్లు చక్కబెట్టేస్తారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాలోనూ, కమిషనరేట్ పరిధిలోనూ ఆరోపణలు బలంగా ఉన్నవారు ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు ఎంత పోటీ ఏర్పడిందో ఇప్పుడు అసిస్టెంట్ సీట్లు ఎక్కడానికి ఆ విధంగానే పోటీ పడుతున్నారు.

కొద్దిరోజుల క్రితం ఒక అర్జీదారుడు ఓ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. రిసెప్షన్‌లో కూర్చున్న సిబ్బంది ఏం కావాలని అడిగారు. ఇన్‌స్పెక్టర్ అసిస్టెంట్ కావాలని అర్జీదారుడు అడిగాడు. ఆయన బయటకు వెళ్లారని సమాధానం చెప్పగానే ఏ పని మీద వచ్చాడో చెప్పకుండానే వెళ్లిపోయాడు అర్జీదారుడు.

మాకు అవకాశం ఇవ్వండి

ఇటీవల జరిగిన బదిలీల్లో పాత నీరు పోయి కొత్త నీరు వచ్చింది. కొంతమంది ఇన్‌స్పెక్టర్లు ఎప్పటి నుంచో ఉన్న వారినే అసిస్టెంట్లుగా కొనసాగిస్తున్నారు. మరికొంతమంది పాత వారిని పక్కన పెట్టి తాత్కాలికంగా ఒకరిని ఏర్పాటు చేసుకున్నారు. స్టేషన్‌లో సిబ్బందిని మొత్తం స్కాన్ చేసిన తర్వాత మంచి మార్క్ ఉన్న వారిని అసిస్టెంట్లుగా నియమించుకోవాలని మరి కొంతమంది ఇన్‌స్పెక్టర్లు చూస్తున్నారు. దీంతో అసిస్టెంట్ల పోస్టులోకి ఎక్కడానికి సిబ్బంది పోటీ పడుతున్నారు. తమకు అవకాశాలు ఇవ్వాలని కొంతమంది నేరుగా ఇన్‌స్పెక్టర్లకు విన్నవించుకుంటే, మరికొంతమంది స్పెషల్ బ్రాంచ్‌లో ఉండే ఇన్‌స్పెక్టర్లతో సిఫార్సులు చేయించుకునే పనిలో ఉన్నారు.

రైల్వే ఆపరేషనల్‌లో పాంప్లెట్ యుద్ధం

అధికారుల వేధింపులపై కరపత్రాలతో ఉద్యోగుల తిరుగుబాటు


Station manager office RAJAHMUNDRY
1)D.Srinivas Reddy
O.s.(Office superintendent)
2)A.B.S.RANGANADH
Station manager
3) Prasad
Traffic inspector/Staff/BZA

➢ The following deeds are being come by them

1. From the past few years, Un skilled awards are being given exclusively for those who follow (in all aspects. Money Liquor etc) him.
2. Timely Periodical Rest(PR), Leave & Adjustments for duties are given based on his own interest but not according to forecast or HOER (Hours of working Rules).
3. His office working hours never be 8 hrs. Always less than 6. Within this time, he does organization work for his team mates.
4. Every month almost 25 days are free, only 5 days. i.e. Muster closing time very busy and also, he nominates one Guard to enter muster details so that to minimize his work load. For this help so called Guard got "Two awards."
5. Habituated for strengthen His Organization by giving untimely PRs, Leave and adjustments by taking Alcohol Bottles ,gifts from those who got help from him.
6. Huge loss of revenue for Administration by giving Over Time (OT) for employees where there is no need at all.
7. Mis management of Staff- Due to this, Financial loss, Violation of HOER. Even though existing/available required staff at SMR office/R.JY.
8. Few important persons wherever worked for his organisational frequently conservation meetings to be held at V.P lounge.
9. Whenever conducted his organisation meetings/dharna/protests he was mismanagement of leaves as per HOER and forecast of trains.
10. Mis management of HOER and not proper checking forecast leads to administrative loss like Over Time Allowance and Kilometre Allowance etc. and further loss is against the labour law policies.

ఉద్యోగులు ముద్రించిన కరపత్రం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉద్యోగులు వదిలిన కరపత్రం ప్రకారం వారిపై వేధింపులకు పాల్పడుతున్న వారిలో విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషనల్ మేనేజర్ (సీనియర్ డీఓఎం) కింద పనిచేసే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (టీఐ) ప్రసాద్ ఒకరు. ఈ టీఐ ప్రసాద్ స్టాఫ్ మ్యాటర్స్ చూస్తుంటారు. ఏ అధికారి అయినా ఒక స్థానంలో నాలుగు సంవత్సరాలకు మించి పనిచేయటానికి వీలు లేదు. మరి ఈ అధికారి ఏకంగా 15 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. మొదటి నుంచీ తమను హింసిస్తున్నాడని ప్రసాద్‌పై డివిజన్‌కు చెందిన గార్డులు, డ్రైవర్లు వాపోతున్నారు. టీఐ ప్రసాద్ వైఖరి కారణంగా తమకు విశ్రాంతి దొరకటం లేదని వాపోతున్నారు. రన్నింగ్ స్టాఫ్ ఏడు నుంచి ఎనిమిది రోజుల పాటు విధి నిర్వహణ చేపడుతుంటారు. ఇలాంటి వారికి ఒకటి, రెండు రోజులు సెలవులు అవసరం ఉంటుంది. సెలవులు ఇచ్చే విషయంలో టీఐ తీరు తమకు ఇబ్బందికరంగా ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు. సెలవులు తీసుకోవటానికి బతిమిలాడాల్సి వస్తోందని, అయినా కనికరించటం లేదని వాపోతున్నారు. గట్టిగా అడిగితే పనిష్మెంట్లకు సిఫార్సులు చేస్తున్నాడని, ధైర్యం చేసి ఆయన ముఖాన అడిగేవారికి డీఆర్ఎంకు చెప్పుకున్నా దిక్కుండదని అంటున్నారని వాపోతున్నారు. ఈ విషయాన్ని సీనియర్ డీఓఎంకు చెప్పుకుందామని ప్రయత్నిస్తే తమను కలవనీయకుండా టీఐ ప్రసాద్ అడ్డుకుంటున్నారని చెబుతున్నారు.

☛ ముగ్గురు అధికారుల తీరుపై కరపత్రాల ముద్రణ

☛ ఉన్నతాధికారులకు తెలియడం కోసం ఆఖరి అస్త్రం

☛ డీఆర్ఎం ఆనంద్ పాటిల్ విచారణ చేపట్టాలని ఉద్యోగుల విన్నపం

బెజవాడ రైల్వే డివిజన్‌లో కిందిస్థాయి ఉద్యోగులపై అధికారుల వేధింపులు తీవ్రమయ్యాయి. రైల్వే ఆపరేషనల్ విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొందరు అధికారుల వేధింపులను దశాబ్దకాలంగా అనుభవిస్తున్న ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లలేక ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు. తమపై జరుగుతున్న అకృత్యాలను కరపత్రాల రూపంలో ముద్రించి పంపిణీ చేయించారు. ప్రధానంగా ముగ్గురిపై అభియోగాలు చేస్తున్నారు. తమ సమస్య డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.

స్టేషన్ మేనేజర్, ఓఎస్‌లపై మరో కరపత్రం

విజయవాడ డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మేనేజర్ ఆఫీసులో సిబ్బందిపై జరుగుతున్న దాష్టీకాలు, అవకతవకలపై మరో కరపత్రాన్ని ప్రచురించి పంపిణీ చేయటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్టేషన్ మేనేజర్ ఏబీఎస్ రంగనాథ్, ఆఫీసు సూపరింటెండెంట్ (ఓఎస్) శ్రీనివాసరెడ్డి... ఉద్యోగులపై సాగిస్తున్న వేధింపులు, అరాచకాలపై ఆ కరపత్రంలో పొందుపరిచారు. రాజమహేంద్రవరం స్టేషన్ పరిధిలో దాదాపుగా 300 మందికిపైగా రైల్వే గార్డులు, పాయింట్స్‌మెన్, స్టేషన్ మాస్టర్‌లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పీరియాడికల్ రెస్ట్‌లకు సంబంధించి తీవ్ర అసమానతలు చూపుతున్నారని వాపోతున్నారు. సెలవుల కేటాయింపులో వీరిద్దరూ వ్యక్తిగత కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాక్స్‌బాయ్ బిల్లుల చెల్లింపులో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని చెబుతున్నారు. ఒక అధికారి 25 మంది ఉద్యోగులతో ఫంక్షన్లు చేసుకోవటంతో మేలో రూ.20 లక్షలకుపైగా ఓవర్‌టైమ్ ద్వారా రైల్వేకు నష్టం జరిగిందని ఉద్యోగులు అంటున్నారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం.

స్టేషన్‌మేనేజర్ అహంకార వైఖరి

స్టేషన్ మేనేజర్ రంగనాథ్ అహంకార వైఖరి చూపటం వల్ల ఉద్యోగుల సమస్యలు చెప్పనలవి కాకుండా ఉన్నాయని వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తీవ్ర పనిష్మెంట్లు ఇస్తున్నారని వాపోతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులు అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసినా రంగనాథ్‌కు విపరీతమైన చిరాకు, కోపం వస్తుందని, ఫోన్ చేసిన వారిపై విరుచుకుపడతారని, ఈ వ్యవహారాలన్నీ చూసే బాధ్యతలను శ్రీనివాసరెడ్డి మీద మోపటంతో ఆయన ఇష్టారాజ్యంగా మారిపోయిందనీ అంటున్నారు. అనుకూలురైన వారిని పోగేసుకుని వారితో విందులు, వేడుకలు చేసుకుంటూ మిగిలిన వారిపై పనిభారం మోపటం, ప్రశ్నించిన వారికి పనిష్మెంట్స్ విధించటం రివాజుగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. తమపై రంగనాథ్, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ సాగిస్తున్న వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు. సమస్యలను డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



పూజలందుకుంటున్న అమ్మవారు

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా..

పవిత్రోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్, ఆగస్టు 18: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శాస్త్రోక్త, వేదోక్త విధానంలో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పవిత్రాలను ఈవో రామారావు, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఇతర అర్చకులు ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, సర్వ ప్రాయశ్చిత్త విధులను నిర్వహించారు. పవిత్రాలకు ప్రోక్షణ చేసి అమ్మవారి మూల విరాట్‌కు, మల్లేశ్వరస్వామికి, నందీశ్వర విగ్రహానికి, అమ్మవారి వాహనం సింహం విగ్రహానికి, ఉపాలయాల్లో కొలువైన దేవతలకు పవిత్రాలను ధరింపజేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 20 వరకు పత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను రద్దు చేశామని, నిత్య కైంకర్యాలను దేవస్థానం అర్చకులు మాత్రమే నిర్వహిస్తారని ఈవో రామారావు తెలిపారు.





మేళతాళాలతో పవిత్రాలు తీసుకొచ్చి, నంది విగ్రహానికి సమర్పిస్తున్న ఈవో, అర్చకులు

దుర్గగుడిలో భక్తుల రద్దీ

దుర్గమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్రోత్సవాల తొలిరోజైన ఆదివారం అమ్మవారికి స్నపన కార్యక్రమాన్ని నిర్వహించటం, అర్చనాది కార్యక్రమాల కారణంగా ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేకువ జామున 3 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపన కార్యక్రమాలను నిర్వహించటం కారణంగా సాధారణ దర్శన సమయానికన్నా 4 గంటలు ఆలస్యంగా దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు క్యూలైన్లలో భారీ సంఖ్యలో వేచి ఉన్నారు. ఇప్పటికే శుక్ర, శని, ఆదివారాల్లో, పర్వదినాల్లో భక్తుల రద్దీని పురస్కరించుకుని అనుసరించాల్సిన విధి విధానాలను రూపొందించటంతో ఆయా విభాగాల అధికారులు భక్తులకు శీఘ్రదర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ అధికారులు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు.

అమ్మవారికి కానుకగా మంగళసూత్రాలు



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు



విజయవాడ మొగల్రాజపురానికి చెందిన కొండపల్లి హరిప్రసాద్ కుటుంబసభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 29 గ్రాముల బరువు గల రాళ్లు పొదిగిన బంగారు మంగళ సూత్రాలు, నాను కోడను ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అధికారులు అందించారు.

అన్నవితరణకు విరాళం

దుర్గగుడిలో అన్నవితరణకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లి చెన్నాయబోడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అధికారుల ద్వారా దేవస్థానానికి అందజేశారు. దాతలకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

చాంబర్‌కు పూర్వవైభవం తీసుకురండి

» నూతన కార్యవర్గానికి ఎంపీ కేశినేని చిన్ని సూచన

ధర్నాచౌక్, ఆగస్టు 18: విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీని ఆర్థికంగా పటిష్టం చేసి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలని నూతన కార్యనిర్వాహకవర్గానికి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. చాంబర్ నూతన కార్యనిర్వాహకవర్గ ప్రమాణస్వీకారం చాంబర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దం బాలవెంకట రవికుమార్, వక్కలగడ్డ శ్రీకాంత్‌తో ఎంపీ ప్రమాణ స్వీకారం చేయించారు. చాంబర్ సభ్యులు, వర్తక, వ్యాపార వర్గాలు ఏకతాటిపై ఉండి చాంబర్‌ను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని ఎంపీ సూచించారు. చాంబర్‌కు అన్ని విధాలుగా అండగా ఉండి, చాంబర్ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చాం బర్ సభ్యులు ప్రభుత్వానికి అండగా నిలవాలని, అన్న క్యాంటీన్లకు సహాయ సహ కారాలు అందించాలని కోరారు. తనను చాంబర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవం చేయడంలో సహాయ సహకారాలు అందించిన కేశినేని చిన్ని, అశోక్‌బాబుకు అధ్యక్షుడు గద్దం బాలవెంకట రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. చట్టాల్లో వచ్చే మార్పులపై సభ్యులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. చాంబర్‌కు అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్ హామీ ఇచ్చారు.

అన్న క్యాంటీన్లకు రూ.25 లక్షల విరాళమిస్తాం

చాంబర్ తరపున అన్న క్యాంటీన్లకు రూ.25 లక్షల విరాళాన్ని సభ్యులందరి సహకారంతో ఎమ్మెల్సీ అశోక్‌బాబు నేతృత్వంలో సీఎం చంద్రబాబుకు అందజేస్తామని చాంబర్ కార్యనిర్వాహక సభ్యుడు దూండి రాకేష్ తెలిపారు.

ఎనర్జీ అసిస్టెంట్లకు సర్వీస్‌రూల్స్ అమలు చేయాలి

» సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్


ధర్నాచౌక్, ఆగస్టు 18: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు విద్యుత్ సంస్థల పాత సర్వీస్ రూల్స్(ఏపీఎస్ఈబీ)ను అమలు చేయాలని సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర ముఖ్య నేతల సమావేశం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. సచివాలయ బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అసోసియేషన్ నేతలు కోరారు. ప్రొబేషన్ పీరియడ్ కంప్లీట్‌ను 2022 జూలై నుంచి అమలు చేయాలన్నారు. బదిలీలకు అవకాశం కల్పించాలని, పాత ప్రమోషన్ చానల్ కల్పించి, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్హత కలిగిన వారికి కన్వర్షన్ అవకాశం కల్పించాలని, ఆర్ఈ సీఎస్ చీపురుపల్లి ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని డిమాండ్ చేశారు. పేస్లిప్‌లలో రెగ్యులర్ అని రావాలని, టీఏ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని లేదంటే ఉద్యమ కార్యాచరణకు రాష్ట్రవ్యాప్తంగా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సీవీ మంజునాథ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి బాలకాశీ పాల్గొన్నారు.



సఫాన్ షాబాబ్‌ను సత్కరిస్తున్న జంపాల సీతారామయ్య తదితరులు

సఫాన్ షాబాబ్‌కు ఇండియా బుక్‌లో చోటు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18: ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన హర్యాజ్ పవర్ సేవింగ్ సిస్టం బై సోలార్ కార్యక్రమంలో సోలార్ కరెంట్‌ను ఉపయోగించి డొమెస్టిక్, గవర్నమెంట్, అగ్రికల్చర్ సెక్టార్లలో పవర్ ఆదా చేయడంపై ప్రదర్శన ఇచ్చి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో సఫాన్ షాబాబ్ చోటు సాధించాడు. అతను పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ ముస్తఫా మనుమడు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య షాబాబ్‌ను సత్కరించారు. భవిష్యత్‌లో దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.



మోపిదేవిలో తనిఖీ నివేదిక వెల్లడిస్తున్న డీఆర్పీ సత్యరాజు

13 బోగస్ పింఛన్ల గుర్తింపు

మోపిదేవి, ఆగస్టు 18: 2023-24 సంవత్సరానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సామాజిక తనిఖీలో బోగస్ సర్టిఫికెట్లతో సామాజిక భద్రతా పింఛన్లు పొందుతున్న వారి గుట్టురట్టు అవుతోంది. బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ లబ్ధి పొందుతున్న వ్యక్తుల వివరాలు తనిఖీ బృందం వెల్లడి ఆదివారం వెల్లడి చేసింది. మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బృందం గ్రామసభ నిర్వహించింది. మోపిదేవి పంచాయతీ పరిధిలో 90 లక్షల విలువైన పనులు ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం డీఆర్పీ సత్యరాజ్ వివరించారు. ఇందులో భాగంగా చేసిన తనిఖీల్లో మోపిదేవి, బోడగుంట గ్రామాల్లో చర్మకారులు, డప్పు కళాకారుల పేరుతో సర్టిఫికెట్లు తీసుకుని 13 మంది అనర్హులు పింఛన్ తీసుకుంటున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. మోపిదేవి కాలనీ వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు 72 మీటర్లకు నగదు చెల్లించగా, అడుగు తక్కువగా నిర్మాణం చేసినట్లు గుర్తించామన్నారు. వీటి నుంచి రికవరీ చేసేలా నివేదిక అందజేయనున్నట్లు డీఆర్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవికుమార్, సచివాలయ కార్యదర్శి గోవింద రాజులు ఉన్నారు.

హంసలదీవి బీచ్‌లో విషాదం

» అలల తాకిడికి కొట్టుకుపోయిన ఆరుగురు
» యువకుడి గల్లంతు, మహిళ మృతి
» నలుగురిని రక్షించిన స్థానికులు, మెరైన్ పోలీసులు





సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని రక్షించి ఆటోలో తరలిస్తున్న పోలీసులు, ప్రమాదం నుంచి బయటపడి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న మండలి బుద్ధప్రసాద్



మృతిచెందిన షేక్ ఫజాలా



గల్లంతైన అబ్దుల్ ముషరఫ్

కోడూరు, ఆగస్టు 18: హంసలదీవి బీచ్‌లో ఆదివారం విషాదం నెలకొంది. అలల తాకిడికి ఓ యువకుడు గల్లంతయ్యాడు. మరో మహిళ మృతిచెందింది. గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని నక్కల కాలువ రోడ్డులో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన 14 మంది రెండు ఆటోల్లో హంసలదీవి బీచ్‌కు ఆదివారం ఉదయం వచ్చారు. కొద్దిసేపు సముద్రంలో స్నానాలు చేశాక, ఆరుగురు లోపలికి వెళ్లారు. సముద్రపు పోటు అధికం కావటంతో ఒక్కసారిగా వారిని అలలు లోపలికి లాగేశాయి. గమనించిన స్థానికులు, మెరైన్ పోలీసులు ఐదుగురిని రక్షించారు. అబ్దుల్ ముషరఫ్(21) సముద్రంలో గల్లంతు కాగా, మిగిలిన వారిని ఒడ్డుకు తీసుకొచ్చారు. వారిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐదుగురిలో షేక్ ఫజాలా(28) అనే మహిళ సముద్రపు నీళ్లు ఎక్కువగా తాగటంతో మృతి చెందింది. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్, ఎస్‌ఐ శిరీష యువకుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఒకరు మృతి చెంది, మరొకరు గల్లంతు కావటంతో కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మహిళ మృతదేహాన్ని అవనిగడ్డలో పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : మండలి

అవనిగడ్డ: హంసలదీవి బీచ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. మెరైన్ పోలీసులు రక్షించిన నలుగురిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, బుద్ధప్రసాద్ వారిని పరామర్శించి మృతుని కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. షేక్ హసీన్, అఫ్రిన్, కరీమ్‌లను పరామర్శించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులను అభినందించారు. గల్లంతైన ముషరఫ్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు తెలిపారు.



ముషరఫ్ కోసం పడవల్లో గాలింపు

పర్యవేక్షణ లోపంతోనే..

పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సముద్రంలోకి యాత్రికులు పోటు సమయంలో లోపలికి వెళ్లకుండా సూచనలు చేయాల్సిన మెరైన్ సిబ్బంది తక్కువగా ఉండటం, కట్టుదిట్టమైన భద్రతలేని కారణంగా ఈ ఘటన జరిగిందని ప్రజలు అంటున్నారు. మెరైన్ సీఐ ఇటీవల బదిలీ కాగా, ఎవరినీ నియమించలేదు. పాలకాయితిప్ప సమీపంలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా సరిగా వాహనాలు తనిఖీలు చేయకపోవటం, పర్యవేక్షణ కొరవడడం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. పాలకాయితిప్ప మెరైన్ స్టేషన్‌కు 60 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, 20 మంది మాత్రమే ఉండటం, వారిని కూడా మూడు ప్రాంతాలకు పంపడంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని వాపోతున్నారు.

నీ సంగతి తేలుస్తా

» దుర్గగుడి సెక్యూరిటీ గార్డుకు వెలంపల్లి పూర్వ అనుచరుడు, ప్రస్తుత బీజేపీ నాయకుడు పైడి ఫణి బెదిరింపులు
» 25 మందిని ఉచితంగా అమ్మవారి దర్శనానికి తీసుకెళుతుండగా అడ్డుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుపై ఫణి ఆగ్రహం

వన్‌టౌన్, ఆగస్టు 18: వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడిగా చలామణి అయి, ప్రస్తుతం బీజేపీలో చేరిన కొత్తపేటకు చెందిన పైడి ఫణి దుర్గగుడిలో ఆదివారం హల్‌చల్ చేశాడు. టికెట్లు లేకుండా అమ్మవారి అంతరాలయ దర్శనానికి తీసుకెళ్లేందుకు మెట్ల దిగువన ఈవో కార్యాలయం పక్కన ఉన్న గేటు వద్దకు 25 మంది భక్తులను తీసుకెళ్లాడు. గేటు వద్ద విధుల్లో ఉన్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డు అతనిని అడ్డుకున్నాడు. తాను దుర్గగుడి లడ్డూ తయారీ కాంట్రాక్టర్‌నని నన్నే అడ్డుకుంటావా? నీ సంగతి తేలుస్తానంటూ బెదిరింపులకు దిగాడు. సెక్యూరిటీ గార్డు ఆలయ ఏఈవో దృష్టికి తీసుకెళ్లాడు. ఏఈవో లడ్డూ తయారీ కాంట్రాక్టర్‌తో మాట్లాడాడు. కాంట్రాక్టర్ తాను భక్తులను తీసుకురాలేదని చెప్పాడు. దీంతో గేటు వద్ద హడావుడి చేసి కాంట్రాక్టర్ పేరు చెప్పిన పైడి ఫణిని పోలీసులకు అప్పగించమని సూచించారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకోకుండా పక్కకు తప్పించి రూ.300 క్యూలైన్‌లో వదిలేశారు. దీనిపై పలువురు భక్తులు పైడి ఫణితో పాటు పోలీసు కానిస్టేబు ల్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం క్రితం కూడా పైడి ఫణి 20 మందిని టికెట్ లేకుండా అంతరాలయం లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆయనను అడ్డుకున్నాడు. దీంతో ఫణి సూపరింటెండెంట్‌పై రెచ్చిపోయి నీ అంతుచూస్తా, వారంలో నిన్ను లేపేస్తానంటూ బెదిరించాడు. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే పేరు చెప్పి, ఓ మాజీ వైసీపీ నాయకుడు 40 మందిని టికెట్ కొనుగోలు చేయకుండా దర్శనానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా, ఆలయ ఉద్యోగులు అడ్డుకున్నారు. ఆ నాయకుడు ఆలయ ఉద్యోగులను బెదిరించాడు. వీరిని కట్టడి చేయటంలో దేవస్థానంపై విధులు నిర్వహిస్తున్న పోలీసులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ షాక్‌తో 18 నెలల చిన్నారి మృతి

» శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



తండ్రితో చిన్నారి మైనా(ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 18: వచ్చీ రాని మాటలు, బుడిబుడి నడకలతో ఇల్లంతా సందడి చేస్తున్న చిన్నారి ఇక లేదని తెలిసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు శోకసంద్రంలో మునిగిపోయారు. విద్యుత్ తీగల రూపంలో మృత్యువు 18 నెలల చిన్నారిని బలికొనడంతో ఆడుకుంటూ మృత్యు ఒడిలోకి వెళ్లిపోయిన చిన్నారిని చూసి న్యూ రాజరాజేశ్వరి పేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్స్ వద్ద స్థానికులు కంటతడి పెట్టారు. కుంభా రాజ్‌కుమార్, తిరుపతమ్మలు న్యూ రాజరాజేశ్వరి పేటలోని అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నారు. వీరికి మైనా(18 నెలలు) అనే కుమార్తె ఉంది. రాజ్‌కుమార్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆడుకుంటూ అపార్ట్‌మెంట్ కింద భాగంలో ఉన్న విద్యుత్ మీటర్ల బోర్డు వద్దకు మైనా వచ్చింది. అప్పటికే విద్యుత్ బోర్డులోని విద్యుత్ తీగలు తెగి బోర్డు మొత్తం విద్యుత్ సరఫరా అవుతోంది. విద్యుత్ మీటర్ల బోర్డు వద్ద ఆడుకుంటున్న మైనా విద్యుత్ బోర్డుకు తగిలింది. ఒక్కసారిగి మైనాకు విద్యుత్ షాక్ తగలడంతో అలాగే ఉండిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు చిన్నారిని బోర్డు వద్ద నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ చిన్నారి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది.

కుటుంబానికి న్యాయం చేయాలి: సీహెచ్ బాబూరావు

చిన్నారి మైనా కుటుంబ సభ్యులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పరామర్శించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ పసిప్రాణం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



ప్రమాదం జరిగిన చోట చెక్కముక్కను ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బంది



అపార్ట్‌మెంట్స్ విద్యుత్ మీటర్ల బోర్డు వద్ద చిందరవందరగా వైర్లు

బాలిక మృతి చెందడానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా విద్యుత్ మీటర్ల బోర్డుకు వైర్ తగిలి విద్యుత్ షాక్ కొడుతోందని పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేశామని అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనా మృతి చెందిన సమాచారం తెలుసుకున్న సిబ్బంది ఆదివారం ఉదయం అపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చి విద్యుత్ మీటర్ల బోర్డులో తెగి బోర్డు మొత్తానికి విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లకు టేపులు వేసి అడ్డుగా ఓ చిన్న చెక్కముక్కను పెట్టి చేతులు దులుపుకొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.4.30 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు స్వాధీనం

» 8 మంది చోరుల అరెస్టు

గుడివాడ రూరల్, ఆగస్టు 18: గుడివాడ రూరల్, పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు చోరీ చేస్తున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.4.30 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు, టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు గుడివాడ రూరల్ ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు బొమ్మలూరు శివారు వద్ద సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా టాటా ఏస్ వాహనంలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు తరలిస్తున్న గుడివాడ పంచవటి కాలనీకి చెందిన 8 మందిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. కట్టా కిరణ్, షేక్ మహబుబ్ సుభాని, గుంజ నాగరాజు, ఉప్పతల జమలయ్య, ఉప్పతల రామకృష్ణ, ఇస్మాక్ బేగ్, గుంజ శివయ్య, ఉప్పతల రామకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంటిబాబు తెలిపారు.



విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్‌హెచ్‌ఏ సంస్థ సభ్యులు

నిత్యావసరాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 18: ఆర్‌హెచ్‌ఏ(రాబిన్‌హుడ్ ఆర్మీ) ఆధ్వర్యంలో పేద విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం మధురా నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఆర్‌హెచ్‌ఏ రాష్ట్ర కోర్డినేటర్ కె.శ్రీనివాస్ విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆర్‌హెచ్‌ఏ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామని, చలికాలం దుప్పట్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జీరో ఫండ్ విధానం ద్వారా నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాలు ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. సంస్థ సిటీ ప్రతినిధి అజయ్, కో ఆర్డినేటర్లు రత్నశ్రీ, అనంతకుమార్, లక్ష్మీ, రామచంద్ర పాల్గొన్నారు.

లింగన్న కోడులో గల్లంతైన
వ్యక్తి మృతదేహం లభ్యం

కోడూరు, ఆగస్టు 18: లింగన్నకోడు మురుగు కాల్వలో శనివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన మాచర్ల భిన్ను(58) శనివారం పశువులను కడిగేందుకు కాలువలోకి దిగాడు. పశువులను కడిగి తన చేతి కర్ర నీటిలో మునిగి పోతుందని ముందుకు వెళ్లాడు. నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. గల్లంతైన మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు కోడూరు ఎస్‌ఐ పి.శిరీష తెలిపారు.

మహిళపై బాత్‌రూం యాసిడ్‌తో దాడి

» నిందితుడు విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి

విజయవాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగడం, ఎదురుగా ఉన్న వాళ్లతో జగడాలకు కాలు దువ్వడం, ఓ విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి జగడాల బాగోతం ఇది. మద్యం మత్తులో ఓ మహిళను దూషించి ఆమెపై బాత్‌రూం యాసిడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన గురునానక్ కాలనీలోని నాక్ కల్యాణ మండపం వద్ద జరిగింది. సీహెచ్ ఆంజనేయప్రసాద్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. ఆయన ఇంటికి ఎదురుగా ఆటోనగర్‌కు చెందిన జొన్నలగడ్డ వెంకట రాజేశ్వరమ్మ బడ్డీ కొట్టు నిర్వహిస్తోంది. ఆంజనేయప్రసాద్ రోజూ మద్యం తాగి ఆమె కొట్టు వద్దకు వెళ్తాడు. గుట్కాలు, ఖైనీలు విక్రయిస్తున్నావని ఆమెతో గొడవ పడతాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో రాజేశ్వరమ్మ కొట్టు వద్దకు వెళ్లాడు. ఆమెను అసభ్యకరంగా దూషించి ఇంటికి వెళ్లిపోయాడు. ఆమె తనను ఎందుకు దూషిస్తున్నావని ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. ఇద్దరి మధ్య కొద్దిసేపు వివాదం జరిగింది. ఆంజనేయప్రసాద్ ఇంట్లోకి వెళ్లి బాత్‌రూంను శుభ్రం చేసే యాసిడ్ తీసుకొచ్చి ఆమెపై పోశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. వెంటనే పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆంజనేయప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకు చిత్రాలు



పారిశుధ్య కార్మికుడి కష్టానికి, శ్రమకు గుర్తుగా..

నేడు ఫొటోగ్రఫీ దినోత్సవం

కార్మికుడి కష్టాన్ని బంధించిందా కన్ను.. చిరువ్యాపారి కావడి కష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపిందా చిత్రం.. కళాకారుడి కళా విశ్వరూపాన్ని విశ్వానికి విజువలైజ్ చేసింది ఆ దృశ్యం..వలస పక్షుల విహారాన్ని వీక్షకులకు విశదీకరించింది ఆ ఫొటో.. పక్క ఫొటోలన్నీ సమాజంలో వ్యక్తులు, పక్షుల బతుకు చిత్రాలు..ప్రపంచానికి చూపిన ఆంధ్రజ్యోతి కెమెరామెన్ల కష్టానికి చిహ్నాలు..సోమవారం ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు.. - విజయవాడ



చిరువ్యాపారి కావడి కష్టానికి చిహ్నంగా..





కళాకారుడి ప్రతిభకు గుర్తుగా..

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.01

పొంగుతున్న డ్రెయిన్లు



ఉయ్యూరు, ఆగస్టు 18 : ఉయ్యూరులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి రోడ్లపై మురుగునీరు పొంగి ప్రవహిస్తుంది. డ్రెయిన్ల పూడిక తీత పనులు అంతంత మాత్రంగా జరుగుతున్న పరిస్థితుల్లో పట్టణంలో పలువార్డులతో పాటు ప్రధాన రహదా రుల్లో సైతం మురుగు నీరు పొంగి ప్రవహిస్తుంది. డ్రెయిన్ల నిర్వహణపై శానిటరీ ఉద్యోగి శ్రద్ధ చూపించకపోవడంతో పారిశుధ్య సమస్యల తలెత్తుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమల బెడదతో ప్రజలు రోగా బారిన పడుతున్నా అధికారులకు చీమకుట్టినట్టయినా లేదని వాపోతున్నారు.

వీధివీధినా బెల్టు షాపులు!

- పెనమలూరు మండలంలో 24 గంటలూ మద్యం లభ్యం
- క్వార్టరుకు రూ. 50-70 అదనంగా వసూలు
- బార్లను తలపిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల పరిసరాలు
- పట్టించుకోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు



పెనమలూరు, ఆగస్టు 18 : మండలంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోంది. మండలంలోని అనేక గ్రామాల్లో, కూడళ్లలో మద్యం విరివిగా లభ్యమవుతోంది. ఒక్కో క్వార్టరు మద్యం సీసాకు 50నుంచి 70 రూపాయలు అదనపు వసూలుతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతోంది. పెనమలూరు గ్రామంలో కట్ట క్రింద ఇరువైపులా, చెరువు ఒడ్డున, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, సాలిపేటలో రెండు మూడు చోట్ల మద్యం ఎప్పు కావాలంటే అప్పుడు లభిస్తోంది. పోరంకి బీజేఆర్ నగర్, నారాయణపురం కాలనీ రోడ్డు వెంట ఉన్న పాన్‌షాపులు, హైస్కూలు సమీపంలోని షాపులలో విపరీతంగా అధిక దరలకు మద్యం అమ్ముతున్నారు. తాడిగడప వంతెనల మధ్య, తాడిగడప గ్రామంలో, కాల్వ కట్టల వెంట నిత్యం మద్యం లభిస్తోంది. తాడిగడప డొంకరోడ్డులో ఈ మధ్య కాలంలో తెలంగాణ మద్యం ఏరులై పారుతోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతోంది. యనమలకుదురులోని అనేక ప్రాంతాల్లో పోలీసు పర్యవేక్షణ కొరవడడంతో మందుబాబుల ఆగడాలకు అంతేలేకుండా పోయింది. మద్యం సేవించిన మందుబాబులు గొడవలకు దిగి అర్ధరాత్రిళ్లు సమీపంలోని నివాస ప్రాంతాల వారికి కంటిమీద కునుకే లేకుండా చేస్తున్నారు. యనమలకుదురులో పోలీసు అవుట్‌పోస్టు అందుబాటులో ఉంచినా పోలీసు సిబ్బంది అక్రమ ఇసుక వాహనాల వద్ద వసూళ్ల కార్యక్రమంలో ఉండి మద్యం అమ్మకం దారులకు అడ్డుకట్ట వేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కానూరు ప్రధాన రోడ్డులో ఉన్న మద్యం దుకాణం సమీపంలో మందుబాబులు రోడ్డుపైనే మద్యం సేవిస్తుండడంతో రోడ్డుపై ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాల చెంతనే తినుబండారాల అమ్మకాలు జరుగుతుండడంతో మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. మద్యం బెల్టు దుకాణాలను నియంత్రించాల్సిన పోలీసు, ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో తూగుతుండడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. బెల్టు దుకాణాలపై అధికారులు తూతూ మంత్రపు దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపి నియంత్రిస్తారని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

టీడీపీ నేత మాతృమూర్తికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరామర్శ



ముసునూరి శ్రీనివాస్ తల్లిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 18 : ఇటీవల ఆర్థోపెడిక్ ఇబ్బందులతో సర్జరీకి గురై కానూరు స్రవంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెదపులిపాక టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాసరావు మాతృమూర్తిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. ఆమె అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బోడె వెంట అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, ముసునూరి శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు ఉన్నారు.

దివ్యాంగులకు చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 18 : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయూత నివ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, దివ్యాంగులకు సహకారమందించేందుకు దాత విశ్రాంత ఉద్యోగి సూర్యనారాయణ ముందుకు రావడం అభినందనీయమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు అన్నారు. హనుమాన్ జంక్షన్ మానవత కార్యాలయంలో వేగిరెడ్డి సూర్యనారాయణ ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తేదీ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన నిత్యావసరాలను ఆదివారం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవలందించడం కంటే రిటైర్ అయిన తరువాత అవసరార్థులను గుర్తించి సేవలందించడం మరింత ఆనందాన్ని కలిగించిందని దాత సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి దివ్యాంగ పాఠశాల, ఆదిత్య బధిరుల పాఠశాల విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు రాజేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు, చలం, ఆదిత్య బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ, ఆశాజ్యోతి దివ్యాంగ పాఠశాల నిర్వాహకుడు మరీదు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మానుబంధాలకు ప్రతీక ధర్మరక్షాబంధన్



వేలేరు శ్రీమన్నారాయణ ఆశ్రమంలో నిర్వహించిన ధర్మ రక్షాబంధన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 18 : కుటుంబ బాంధవ్యాలకు, ధర్మ పరిరక్షణకు అధిక ప్రాధా న్యతనిచ్చే భారతీయ సంప్రదాయంలో రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్)కి ఒక ప్రత్యేకత ఉందని సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. వేలేరులోని శ్రీమన్నారాయణ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన ధర్మరక్షాబంధన్ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ కన్వీనర్ దావులూరి రమా దేవి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హారతి ప్రముఖ్ కల్వకుంట్ల లక్ష్మి, ధార్మిక సభ్యులు, భక్తిబృంద సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పమిడిముక్కల : రౌడీ షీటర్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలికి మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ చిట్టిబాబు అన్నారు. పమిడిముక్కల, తోట్లవల్లూరు స్టేషన్ల పరిధిలో రౌడీషీటు ఉన్న వారికి ఆదివారం తన కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర మెడికల్ హబ్‌గా విజయవాడ

మంత్రి కొల్లు రవీంద్ర



కానూరు స్రవంతి ఆసుపత్రి నూతన బ్లాక్ ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె, యార్లగడ్డ, బోడె

పెనమలూరు, ఆగస్టు 18 : విజయవాడను భవిష్యత్తులో రాష్ట్రానికి మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం కానూరు బందరు రోడ్డులోని స్రవంతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన బ్లాక్‌ను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి భాగస్వామ్యంలో ప్రతిపౌరుడికీ పాతిక లక్షల బీమా సౌకర్యాన్ని అమలు పరిచే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో మూలన పడ్డ ఆరోగ్యశ్రీ పథకానికి మరమ్మతులు చేసి ఆసుపత్రులలో సేవలను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, గత మూడేళ్లగా విజయవాడలో ఎక్కడ ఉచిత మెడికల్ క్యాంపులు పెట్టినా స్రవంతి ఆసుపత్రి యాజమాన్యం తనవంతు సేవలందించారని కొనియాడారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ మాట్లాడుతూ, భవిష్యత్తులో దేశవిదేశాల నుంచి పేషెంట్లు విజయవాడ వచ్చి వైద్యసేవలు పొందే అవకాశం ఉందని, ఆదిశగా స్రవంతి ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ విజయ్ శ్రీనివాస్, డాక్టర్ స్రవంతి అందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎమ్మెల్సీ మధుసూదన్, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మాజీ జడ్పీ చైర్మన్ గద్దె అనూరాధ, బొప్పన భవకుమార్, మాజీ మంత్రి పీతల సుజాత, చెరుకూరి రాజేశ్వరరావు, బొందలపాటి సుధాకర్, ఏసీపీ దామోదర్ తదితరులు హాజరయ్యారు

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పూజలందుకుంటున్న ఉత్సవ మూర్తులు

గన్నవరం, ఆగస్టు 18 : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవం ఘనంగా కొనసాగుతుంది. ఈ నెల 16వ తేదీన జరిగిన శ్రావణమాస ఉత్సవాలు అనంతరం లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకి వాహనంపై ఉంచి గ్రామోత్సవం ప్రారంభించారు. పాత గన్నవరం, చింతలపేట, రామ్‌నగర్, సొసైటీ పేట, రాయనగర్ ప్రాంతాల్లో ఊరేగింపు జరిగింది. ఆదివారం ఉదయం నుంచి యాదవుల పేట, గౌడపేట, బుద్ధవరం రోడ్డు, చెంచుల కాలనీ, శ్రీనగర్ కాలనీ, రజకులపేట, సగర్లపేటలో గ్రామోత్సవం జరుగు తుంది. తమ ఇళ్ల ముందుకు వచ్చిన ఉత్సవ మూర్తులను దర్శించుకుని నీళ్ల వారపోసి హారతులు పట్టారు. డప్పు వాయిద్యాలు, యువకుల కోలాహలం మధ్య గ్రామోత్సవం అత్యంత ఉత్సాహంగా సాగుతుంది. మూడురోజులుగా జరుగుతున్న గ్రామోత్సవం సోమవారం తెల్లవారు ఝామున ముగిస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకుంటారని చెప్పారు.

రాఖీల దుకాణాలు కిటకిట



ఉయ్యూరులో రాఖీల దుకాణాల వద్ద రద్దీ

ఉయ్యూరు, ఆగస్టు 18 : రాఖీ పండుగ పురస్కరించుకుని ఆదివారం ఉయ్యూరులో దుకాణాలు కిటకిటలాడాయి. ప్రధాన రహదారి, కాటూరు రోడ్డు, శివాలయం రోడ్డు, పాతస్టేట్‌బ్యాంక్ రోడ్డులో రాఖీలు అమ్మే దుకాణాలు వెలిశాయి. సోదరులకు సోమవారం రాఖీ బందన్ చేసేందుకు కొనుగోలు చేసేందుకు మహిళలు, బాలికలు తరలిరాగా షాపులతో పాటు రోడ్లు రద్దీగా కన్పించాయి.



ఆలయ యాగశాలలో అధివాసాంగ హోమంలో పరమేశ్వరరెడ్డి, ఇతర భక్తులు

పెదఓగిరాలలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ నేడు

పెదఓగిరాల(ఉయ్యూరు), ఆగస్టు 18 : పెదఓగిరాలలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి, సద్గురు సాయినాథ స్వామి, పరివార దేవతల ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8-47 గంటలకు నిర్వహించే ప్రతిష్ఠ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం విష్వక్సేన పూజ, సోమనాథపూజ, యాగశాల నిత్యహోమములు, అధివాసాంగ హోమములు, లక్ష్మీగణపతి శ్రీసూక్త, దుర్గాసూక్త, సద్గురు సాయి నాథ గాయత్రి మూలమంత్ర కళాహోమములు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకాపురం, ఆగస్టు 18 : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అనంత్ శ్రావణకుమారి(37) వాంబేకాలనీలో నివాసం ఉంటుంది. భర్త నాని లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. గత కొంత కాలంగా మహిళ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈనెల 16న మహిళ ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. అయితే మహిళ బ్రైన్‌లో రక్తం గడ్డకట్టడం కారణంగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. శ్రావణకుమారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

పాయకాపురం, ఆగస్టు 18 : ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఓ యువకుడు మృతి చెందిన ఘటన వాంబేకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వాంబేకాలనీ బీబ్లాక్‌కు చెందిన షేక్ కేశవ(17) నగరంలోని కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఎవరు లేని సమయంలో ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చి చూసిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేశవ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగానమ్మకు పూజలు



ఉయ్యూరు, ఆగస్టు 18 : శ్రావణమాస ఆదివారం పురస్కరించుకుని సుందరమ్మపేటలో కొప్పువెలమ సంఘం ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పసు పుకుంకుమ, చీర సారెతో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

నగర అభివృద్ధికి నిపుణుల సహకారం తీసుకుంటాం

ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్‌తో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

మొగల్రాజపురం, ఆగస్టు 18 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు నగరంలో సమస్య లు పరిష్కరించడానికి ఐటీ నిపుణుల సహకారం తీసుకుంటామని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. ఆదివారం ఉదయం వారు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్‌తో, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నగర అభివృద్ధి నగరంలో సమస్యల గురించి పాలిటెక్నిక్ కళాశాల సిబ్బందితో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సకాలంలో తీసుకొచ్చి రాష్ట్రాన్ని, నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కూట మి ప్రభుత్వం ఉంది కాబట్టి కేంద్రం కూడా రాష్ట్రం పట్ల తమ వంతు సహకారాన్ని అందిస్తుం దన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, అమ రావతి పరిధిలో క్రీడలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. వాకర్స్ సంఘా లకు కూడా అవకాశాలు కల్పించాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని శివనాథ్ ఎంపిక కావ డం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ క్రీడల అభివృద్ధికి ఆయన తనవంతు సాయం చేస్తారని చెప్పారు. రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు ఫ్లైవోవర్ నిర్మాణం చేస్తున్నామని, కొండప్రాంతా లలో వర్షం నీరు రోడ్లమీదకు వచ్చి నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చేబుతోందని దానిని అచరించి చూపి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషా రాణి, జాస్తి సాంబశివరావు, సూరపనేని శివనాగేశ్వరరావు, గుత్తికొండ సతీష్, పాలిటెక్నిక్ ప్రిన్సి పాల్ శ్రీనివాసరావు, విష్ణు, రాజా, ధూళిపాళ్ల రమేష్, మల్లెల రామకృష్ణ, ఎర్నేని వేదవ్యాస్, వాసి రెడ్డి లక్ష్మణరావు, కాటంరాజు, పడాల గంగాధర్ పాల్గొన్నారు.

ముఖమండపానికి శంకుస్థాపన

పెదపారుపూడి : యలమర్రులో శివాలయం ముఖ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూరపనేని వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.01

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మంత్రి రవీంద్ర



మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందజేశారు.

తెలుగుభాషకు పూర్వ వైభవం తెస్తాం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 18 : తెలుగుభాషకు పూర్వ వైభవం తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జిల్లా గ్రంథాలయ సంస్థలో పి.వి. శైలజ రచించిన సాయిచరిత శతకాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు.

మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా గ్రంథాలయాల్లో సాహిత్య, తెలుగుభాష కార్యక్రమాలకు ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. తిరిగి సీఎం చంద్రబాబు నేతృత్వంలో తెలుగుభాషకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. పాలనా భాషగా తెలుగు అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మొదటిగా ఆవిర్భవించిన కృష్ణాపత్రిక మచిలీపట్నంలోనే ప్రారంభించారన్నారు. డాక్టర్ చింతల పాటి మురళి కృష్ణ సాయిచరిత పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేననాయకులు బండి రామకృష్ణ, డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీఅధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, సామాజిక కార్యకర్త పి.వి. ఫణికుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.శ్రీరామ్, సాహితీ మిత్రులు అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, అప్పినీడు పోతురాజు, మేరీ కృపాబాయి తదితరులు ప్రసంగించారు. సంస్థ ఉపాధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రచయిత్రి పి.వి. శైలజ, భగవద్గీత స్వర్ణపతక గ్రహీత జొన్నలగడ్డ మాధవిని సత్కరించారు. బాల మేధావి కార్తికేయ భగవద్గీత పారాయణ చేసి మంత్రి ప్రశంసలు పొందాడు.



సాయిచరిత శతకాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్ర, బుద్ధప్రసాద్, టీటీడీ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి, కవయిత్రి శైలజను సత్కరిస్తున్న రవీంద్ర, బుద్ధప్రసాద్

బ్రాహ్మణులకు అండగా నిలుస్తాం

బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రూ.15 లక్షల మేర రుణాల మంజూరు చేస్తూ అనుమతి లేఖలను మంత్రి కొల్లు రవీంద్ర లబ్ధిదారులకు అందజేశారు. రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నంలో నిరుపేద బ్రాహ్మణులకు ఉపయోగకరంగా బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్రాంచిని ఏర్పాటు చేసి అండగా నిలబడతామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ బ్రాహ్మణ నాయకుడు పి.వి. ఫణికుమార్, చోడవరపు లక్ష్మీప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి స్మారక భవనాన్ని తీర్చిదిద్దుతాం

వైసీపీ పాలకులు ఎన్ని అవరోధాలు కల్పించినా పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పట్టాభి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభి సీతారామయ్య ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టాభి స్మారక కమిటీ ప్రతినిధులు సింగరాజు గోవర్ధన్, మెహర్ బాబా, కాళీపట్నపు ఉమ, సింగరాజు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిని సందర్శించిన గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థుల బృందం

స్వచ్ఛ సుందర చల్లపల్లి స్ఫూర్తిదాయకం

• గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థుల బృందం సేవలు

చల్లపల్లి, ఆగస్టు 18 : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమని గుంటూరు మెడికల్ కళాశాల 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులు ఆదివారం చల్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. తమ స్నేహితులు డాక్టర్ డీఆర్కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి ఆధ్వర్యంలో 3207 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. జాతీయ రహదారికి ఇరువైపులా కొబ్బరి, మామిడి, నీడనిచ్చే మొక్కలను నాటారు. వైద్యబృందం మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, స్వచ్ఛత, పరిశుభ్రత, సుందరీకరణ కోసం డీఆర్కే దంపతుల ఆధ్వర్యం లో నిర్విరామంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం చల్లపల్లి రూపురేఖలను సమూలంగా మార్చుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామ ప్రజలు ఎలాంటి బాధ్యత తీసుకోవాలో చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి తెలుసుకునే స్థాయిలో డీఆర్కే దంపతులు, స్వచ్ఛ కార్యకర్తల కృషి ఉందన్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డిఆర్కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు. స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ హాషిం, డాక్టర్ ప్రీతి, డాక్టర్ రూస్సీ, డాక్టర్ పద్మలక్ష్మి, వైజాగ్‌కు చెందిన డాక్టర్ బిఆర్కె, డాక్టర్ సుధాకర్‌బాబు, డాక్టర్ జీఎస్‌పి, గుంటూరుకు చెందిన డాక్టర్ రేణుక, డాక్టర్ తారక్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ సుబ్బారావు(నల్గొండ), డాక్టర్ సాంబిరెడ్డి(తెనాలి), డాక్టర్ పద్మ(విజయవాడ), డాక్టర్ పద్మసుందరి (విజయవాడ), డాక్టర్ నీరద (ఒంగోలు), డాక్టర్ జవహర్ (ఒంగోలు), డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు (మచిలీపట్నం), డాక్టర్ రాజేంద్రప్రసాద్(పాలకొల్లు), డాక్టర్ వైఆర్కె.ప్రసాద్ (ఏలూరు) ఉన్నారు.

అనాథలు, పేదల కల్పతరువు ఐవీఎం

• 233 మందికి రూ.40 లక్షలు సహాయం, ల్యాప్‌ట్యాప్‌ల బహూకరణ

• ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవా సంస్థ డైరెక్టర్ సురేష్‌కు ఎమ్మెల్యే మండలి అభినందన



ల్యాప్‌ట్యాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి, ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్ దంపతులు

చల్లపల్లి, ఆగస్టు 18 : అనాథలు, పేదల కల్పతరువుగా ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవా సంస్థ నిలుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పురిటిగడ్డలోని ఐవీఎం హోంలో ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతుల ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో 233 మందికి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కా లర్‌షిప్‌లు, బీటెక్ విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ, స్కూల్, కాలేజ్ విద్యార్థులు ఫీజులు సహాయంగా అందించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో దశాబ్దాలుగా విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ఐవీఎం అన్నారు. సమాజ సేవ చేస్తున్న ఐవీఎం సురేష్ ధన్యజీవి అన్నారు. ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ, 23 సంవత్సరాల నుంచి తమ హోమ్ ద్వారా వందలాది మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లు అయ్యారన్నారు. ప్రతి నెలా పేద వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం, నెలవారీ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అవసరాలు గుర్తించి మరెన్నో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చెక్కులు, ల్యాప్‌ట్యాప్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. యువనేత మండలి వెంకట్రామ్, కాకినాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎన్ఎస్‌వికె.దుర్గారావు, ఐవీఎం ట్రస్ట్ సభ్యులు ఎన్.ఫణి, జి.ప్రసాద్, వేములపల్లి విజయ, వేములపల్లి సోఫి, విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రప్రసాద్, వైఎస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్ : వేకనూరులో సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో మాదివాడ కాంతారావు - యామిని దంపతులు కల్యాణం జరిపించారు. గుడివాక దాసు ఆర్థిక సహాయంతో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.



వైభవంగా గంగానమ్మ సంబరాలు

కూచిపూడి, ఆగస్టు 18 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. మేళతాళాలు, డప్పు విన్యాసాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. కూచిపూడి గంగానమ్మ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పెదపూడి గంగానమ్మ చెట్టు వద్ద మొక్కుబడులు చెల్లించుకున్నారు. మొవ్వలో గంగానమ్మ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కారకంపాడులోనూ సంబరాలు జరిగాయి.



హనుమంతపురం, వీరంకిలాకులో..

హనుమంతపురం (పమిడిముక్కల) : హనుమంతపురంలో ఆదివారం జలస్థూప ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామ ఊర చెరువులో జరిగిన జలప్రతిష్ఠ స్థూప కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని పూజలు చేశారు. టీడీపీ నాయకుడు లింగమనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు. వీరంకిలాకులో ఆదివారం అంకమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని పూజలు చేశారు. మేడూరులో గంగానమ్మ సంబరం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్‌రాజా పూజలు చేశారు.



పెదకమ్మవారిపాలెంలో శ్రీరాముడి లోహ విగ్రహ ప్రతిష్ఠ

నాగాయలంక : మండలంలోని పెదకమ్మవారిపాలెం రామాలయంలో ఆదివారం ఉదయం శ్రీరామచంద్రుడి లోహ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సబ్బినేని పెద వీరరాఘవయ్య, సత్యనారాయణమూర్తి, కృష్ణకిషోర్ స్వామి వారి విగ్రహాన్ని వితరణ చేయగా, అర్చకులు శర్మ బ్రహ్మత్వంలో సర్పంచ్ తలశిల అర్జునరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తూనుగుంట మాధవి బృందం భజనలు జరిపారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. సబ్బినేని పద్మజతోపాటు గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.



యలమర్రులో పాఠశాల భవనం ప్రారంభం

పెదపారుపూడి : విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. యలమర్రులో రూ.25 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం ప్రారంభించారు. వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. సర్పంచ్ కొల్లు అనూష, మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, సూరపనేని వెంకట సత్యనారాయణ, మసిముక్కు రాంబాబు, చిలకా ఆంజనేయులు, చప్పిడి కిషోర్, చెరుకూరి రమేష్, దగాని లెనిన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెడ్ కాంక్రీట్ తొలగింపుపై రైతుల ఆగ్రహం

కోడూరు : ఈస్ట్ ఛానల్ 14వ నెంబర్ పంట కాలువ లో నిర్మించిన వంతెన వద్ద బెడ్ కాంక్రీట్ తొలగింపు పనులపై వివాదం చోటు చేసుకుంది. ఆధునీకరణ పనుల్లో భాగంగా 14ఏ, బి, కాలువల నూతన గేట్ల ఏర్పాటు, వంతెన నిర్మాణం చేపట్టారు. ఏ, బి కాలువలకు నీరు సమృద్ధిగా రాలేదని గతంలో రైతులు పంటకాలువల పక్కన ప్రత్యేక తూములు వేసుకున్నారు. ఊటగుండం, బసవవానిపాలెం, రామకృష్ణాపురం గ్రామాల రైతులు వంతెన కింద ఉన్న బెడ్ కాంక్రీట్ తొలగించే పనిని శనివారం రాత్రి చేపట్టారు. కాంక్రీట్ తొలగించరాదని ఇరాలి గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఎస్సై పి.శిరీష గొడవను నివారించి రైతులకు సర్ది చెప్పి ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు రైతులు గొడవలు పడకుండా ఉండాలని సూచించారు. అక్రమ తూములు తొలగించి పూర్తిస్థాయిలో సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

నేతాజీకి ఘననివాళి

నాగాయలంక : స్వాతంత్ర్య సముపార్జనకు అలుపెరగని పోరాటం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ గొప్ప దేశభక్తుడని టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు పేర్కొన్నారు. నేతాజీ 79వ వర్ధంతి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, మల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పామర్రు : ఈనెల 20 నుంచి నిర్వహించనున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు.



దివ్యాంగులకు సాయం భగవంతునికి సేవతో సమానం

మచిలీపట్నం టౌన్ : దివ్యాంగులకు సాయం భగవంతుని సేవతో సమానమని న్యాయవాది, మదర్ థెరెసా సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అన్నారు. దివ్యాంగురాలు ఎన్ శారదాకుమారికి కృత్రిమ కాలును, రూ.15 వేల ఆర్థిక సాయాన్ని లంకిశెట్టి బాలాజీ, పైడిపాముల గురుప్రసాద్ అందజేశారు. శారదా కుమారికి రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, కుమ్మరి జలా చంద్రుడు, పద్మనాభుని శేఖర్, లంకే నాంచారయ్య పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఉచిత వైద్యశిబిరం


గుడివాడ : కోతిబొమ్మసెంటర్‌లోని టి.ఎల్ ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీ పెరుమాళ్ళు ప్రభావతి, చలసాని రాయన్‌చౌదరి జ్ఞాపకార్థం ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రి వైద్యులు 85 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. డాక్టర్ అఖిల్ తేజ, డాక్టర్ నిఖిల్ తన బృందంతో వైద్యసేవలందించారు. క్లబ్ ప్రోగ్రామ్ కన్వీనర్లు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ముఖమండపానికి శంకుస్థాపన

పెదపారుపూడి : యలమర్రులో శివాలయం ముఖ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజ లు నిర్వహించారు. సూరపనేని వెంకట సత్యనారాయణ, మసిముక్కు రాంబాబు, చప్పిడి కిషోర్, చెరుఎకూరి రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పురాణం పంతులు మేడిచర్ల కన్నుమూత



చల్లపల్లి : పురాణం పంతులుగా పేరొందిన మేడిచర్ల శ్రీరామ చంద్రమూర్తి(95) శనివారం విజయవాడలోని తన కు మారుని ఇంటిలో కన్నుమూశారు. 1970 నుంచి ఆయన చల్లపల్లి జమిందారు కోటలో రాజపురోహితునిగా వ్యవహరించారు. శ్రీరామచంద్రమూర్తికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీరామచంద్రమూర్తి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ప్రజా దర్బార్ నేడు : గొర్రెపాటి



మచిలీపట్నం టౌన్ : మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తోందని టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా దర్బార్‌లో ఇప్పటి వరకు 1338 దరఖాస్తులు రాగా, 970 సమస్యలను పరిష్కరించామన్నారు. 198 దరఖాస్తులు ఉద్యోగాలు కోసం వచ్చాయని, వీరికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజాదర్బార్ జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు.



రౌడీ షీటర్లకు సీఐ చిట్టిబాబు కౌన్సెలింగ్

పమిడిముక్కల : రౌడీ షీటర్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలికి మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ చిట్టిబాబు అన్నారు. పమిడిముక్కల, తోట్లవల్లూరు స్టేషన్ల పరిధిలో రౌడీషీటు ఉన్నవారికి ఆదివారం తన కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కుమార్‌రాజాతో భేటీ

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను పమిడిముక్కల సీఐ వై. చిట్టిబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వాసవీక్లబ్ వైద్యశిబిరాలు

చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఉచిత నేత్ర పరీక్షా శిబిరంలో డాక్టర్ మోహనరావు 40 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 13 మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. వరదా భరత్ రవికుమార్, గీతామహాలక్ష్మి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత హోమియో వైద్యశిబిరంలో డాక్టర్ సాయి మణికంఠ 40 మందికి వైద్యసేవలందించారు. ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, దింటకుర్తి జ్యోతి, దేసు జయలక్ష్మి, గోళ్ల చైతన్య, సాయిలక్ష్మి, నంబూరి కుసుమకుమారి, మంచికంటి అనూష, మలిశెట్టి చెంచురాములు సేవలందించారు.